క్లుప్తంగా

నిధులు మంజూరు చేయండి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కోరారు. మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత్ బోకేడేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శాంతినగర్, శ్రీనగర్, ఆల్విన్ కాలనీ, బండ్లగూడ, సాయిరాంనగర్ కాలనీల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు 60 లక్షల వ్యయం అవసరమవుతుందని వివరించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటిన ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సభ్యులు

సంగారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సభ్యులు వంశీ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా సమైక్య కార్యాలయం, మహిళా పెట్రోల్ పంపుల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పర్యావరణాన్ని కాపాడుతూ మొక్కలను పెంచాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మూడు సంవత్సరాల పాటు పూర్తి బాధ్యత తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రమేశ్‌బాబు, జిల్లా సమాఖ్యా సభ్యులు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



జేసీబీతో మురుగును తొలగిస్తున్న సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో పరిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. దసరా పండుగ నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పరిశుద్ధ్య పనులపై దృష్టి సారించారు. ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించడంతో పాటు మురికి కాల్వలను శుభ్రం చేయిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని రేణుకఎల్లమ్మ కమాన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. అలాగే, రాంగ్‌రూట్‌లో వాహనాలు డ్రైవింగ్ చేయొద్దన్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

పటాన్‌చెరు: దసరా పండుగ నేపథ్యంలో ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశవర్కర్లు, అర్చకులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలను ఆశ వర్కర్లు నిత్యం చేరవేస్తూ సేవలు చేస్తున్నారని కొనియాడారు. అలాగే, అర్చకులకు దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని తమ వంతు సహకారంగా దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, ఆశ వర్కర్లు ,అర్చకులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సద్దుల సంబురం

జిల్లా వ్యాప్తంగా మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద పెట్టి భక్తిశ్రద్ధలతో ఆడిపాడారు. డీజే పాటలకు యువతులు స్టెప్పులు వేసి సందడి చేశారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.



కంగ్టి: సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నారాయణఖేడ్: సాయిబాబా ఆలయం వద్ద..



జిన్నారం: గుమ్మడిదలలో మహిళల ఆటాపాట..



న్యాల్‌కల్(జహీరాబాద్): హనుమాన్ ఆలయం వద్ద



జహీరాబాద్: ట్రాలీపై ఏర్పాటు చేసిన బతుకమ్మ



జహీరాబాద్: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో



ఝరాసంగం(జహీరాబాద్)లో..

రసాయన కర్మాగారం ఏర్పాటు వద్దు

ఐదు గ్రామాల రైతులు తరలిచ్చి ధర్నా

జహీరాబాద్: రసాయన కర్మాగారం ఏర్పాటును తమ గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని మండలంలోని కొత్తూర్(బి) గ్రామ రైతులు ధర్నా చేపట్టారు. మంగళవారం గ్రామంలోని వైజయంతి కర్మాగారం ప్రధాన గేటు ఎదుట ఐదు గ్రామాల రైతులు బైఠాయించి ఆందోళనకు దిగారు. గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే రసాయన కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. గతంలో దక్కన్ పేరుతో ఉన్న కర్మాగారాన్ని ఇప్పుడు వైజయంతి పేరుతో ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రసాయన కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తే తమ గ్రామం వల్లకాడు అవుతుందని, సారవంతమైన భూములు నిస్సారంగా మారి వ్యవసాయం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో కొత్తూర్(బి) గ్రామంతో పాటు పక్కనే ఉన్న దిడిగి, బూర్దిపాడ్, బూచనెల్లి, తూంకుంట గ్రామాలు సైతం కాలుష్యం కోరల్లో చిక్కుకుంటాయని అన్నారు. పాత భవనాన్ని పునరుద్ధరించి రసాయన కర్మాగారం ఏర్పాటుకు యాజమాన్యం ప్రయత్నం చేస్తోందని, దీనిని అడ్డుకుంటామని హెచ్చరించారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగింది. నాలుగు రోజుల్లో యాజమాన్యం కర్మాగారం ఏర్పాటు విషయంలో స్పష్టత ఇవ్వాలని, లేనట్లయితే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు.



కర్మాగారం గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు



హనుమాన్ చాలీసా చేస్తున్న అర్చకులు, భక్తులు

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

సదాశివపేట(సంగారెడ్డి): నగర సంకీర్తనలో భాగంగా మంగళవారం ఉదయం పట్టణంలోని లోపలి కోట హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పారాయణం, లింగాష్టక పారాయణం సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ బంధువులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవి గోదాళం

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని బాన్సువాడ గ్రామంలో మంగళవారం మహారాష్ట్రలో అత్యంత ప్రముఖ జానపదమైన ఆధ్యాత్మిక జానపదం గోదాళం జాగరణ కాలక్షేపం నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆశ్వయుజ శుద్ధ సప్తమిని పురస్కరించుకొని ప్రత్యేకంగా దేవి విగ్రహానికి ఆలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా జాగరణ, భజనలు చేసి మహాహారతి ఇచ్చారు.



హారతి ఇస్తున్న మహిళలు

ఇంపాక్ట్‌లో ప్రతిభ



సర్టిఫికెట్ అందుకుంటున్న నాందేవ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి కాకిజన్‌వాడకు చెందిన గొనీ సోని, రాఘవాపూర్ గ్రామానికి చెందిన యువకుడు నాందేవ్ ఇంప్యాక్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. టీటీడబ్ల్యూ (ట్రెన్ ది ట్రెనర్ వర్క్ షాప్) వారు ఇంప్యాక్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై యువతి, యువకులకు 35 రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2 రోజుల పాటు హైదరాబాద్‌లో లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేక్ష శిక్షణా తరగతులు నిర్వహించారు. అందులో సోని, నాందేవ్ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వారికి ఇంప్యాక్ట్ ఫౌండర్ నాగేశ్వర్‌రావు శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు.

గోమాతకు అంత్యక్రియలు

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలం తడ్కల్‌లోని ఎస్సీకాలనీలో అనారోగ్యంతో ఆవు మృతి చెందింది. కాలనీవాసులు బాజ భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. చిన్న గంగారాంకు చెందిన గోవు మరణించడంతో సనాతన ధర్మం పాటించి ఖననం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తడ్కల్ క్లస్టర్ కోశాధికారి డేవిడ్, ప్రధాన కార్యదర్శి చిలుక గంగారాం, కార్యదర్శి ఎర్రోళ్ల రాజు ఉన్నారు.

మురికి కాల్వలను పరిరక్షించాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మురికి కాల్వలను కబ్జా చేయడం వల్ల నీరు జనవాసాల మధ్య చేరుతోందని జాగో తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు నేత ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బాగారెడ్డిపల్లి నుంచి రాచన్నపేట, ఆర్యనగర్ వైపు వెళ్లే పెద్దవాగు పూర్తిగా కబ్జాకు గురైందన్నారు. వాగుపైనే నిర్మాణాలు చేపట్టడం వల్ల మురికి నీరు అండర్ రైల్వే బ్రిడ్జి కిందికి వస్తుందన్నారు. ఎన్‌జీవోస్ కాలనీ నుంచి మోహన్ థియేటర్ పక్క నుంచి శ్రీనగర్ కాలనీకి వెళ్లే వాగు కూడా కబ్జాకు గురైందన్నారు. అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి కబ్జాలకు గురైన వాగులను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాదినం శివప్రసాద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాములు నేత

ఆందోళనలో అన్నదాతలు

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): సింగూర్ ప్రాజెక్టు 11 గేట్లు ఎత్తడంతో దిగువన ఉన్న గ్రామాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం మండలంలోని కొల్కూర్, నిజాంపూర్, ఎట్టిగడ్డ సంఘం శివారులోని పత్తి, వరి పొల్లాలోకి వరద నీరు చేరింది. వరద తగ్గకపోతే పంటలు నష్టపోయే ప్రమాదముందని ఆయా గ్రామాలు ప్రజలు వాపోయారు. నిజాంపూర్, కొల్కూర్, రోడ్డు పైకి వరద ప్రవాహం రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కొల్కూర్ గ్రామ ప్రజలు మాచిరెడ్డిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దిగువన ఉన్న నివాసితులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఎట్టిగడ్డ సంఘం శివారులోని సంగమేశ్వర ఆలయంలోకి వరద నీరు చేరడంతో ఆలయాన్ని మూసేశారు.



పంట పొల్లాలోకి చేరిన వరద

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధి కాజిపల్లిలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం తహసీల్దార్ దేవదాస్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న ఆర్‌ఐ

దసరా పండుగ సందడి



కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణం

సదాశివపట(సంగారెడ్డి): దసరా పండుగ సందర్భంగా సదాశివపేట పట్టణంలోని వస్త్ర దుకాణాలు, బ్యాంగిల్స్, రేడిమెడ్, ఫుట్‌వేర్ ఇతర దుకాణాలు కొనుగోలు దారులతో వారం రోజులుగా కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని శాస్త్రిరోడ్, సుభాష్‌రోడ్, పిట్లలకేరీ, బుక్కకేరి, గాంధీచౌక్, ప్రాంతాల్లో ఉన్న దుకాణాలు కొనుగోలు దారులతో సందడి సందడిగా మారాయి.

సింగూరుకు పోటెత్తిన వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు అక్కడి బ్యారేజీలు నిండి మిగతా నీళ్లన్నీ మంజీరా నది గుండా సింగూరు డ్యాంలోకి చేరుతున్నాయి. మూడు రోజుల నుంచి డ్యాంలోకి లక్ష క్యూసెక్కుల నీరు చేరుతుంది. దీంతో 11 గేట్లు రెండు మీటర్లు మేర ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. 1,65,33క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అంతే నీటిని దిగువకు వదులుతున్నారు.

వృత్తి కళాకారులను ఆదుకోవాలి

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం వృత్తి కళాకారులను ఆదుకోవాలని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగభూషణం కోరారు. పట్టణంలోని రాంనగర్‌లో నిర్వహించిన ప్రజా నాట్యమండలి ద్వితీయ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది వృత్తి కళాకారులు ఉన్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, బస్సు ప్రయాణంలో రాయితీ, కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని చెప్పారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు మాణిక్యం, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. పాహిమాం

దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఆయా ఆలయాలు, మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. మంగళవారం అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సంగారెడ్డి టౌన్: దుర్గా భవానీ మాత అలంకరణలో అమ్మవారు



పటాన్‌చెరు టౌన్: నవపాన్ సమీపంలో..



వట్‌పల్లి(అందోల్): కన్‌సాన్‌పల్లి గ్రామంలో..



నారాయణఖేడ్: బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో..



నారాయణఖేడ్: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



భారతినగర్ డివిజన్ పరిధిలో..



జిన్నారం: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భద్రకాళి మాత



ఝరాసంగం(జహీరాబాద్): ఉత్సవాలలో దుర్గామాత దర్శనం



జహీరాబాద్ టౌన్: రాచన్నపేటలో నిర్వహిస్తున్న చండీయాగం